# సన్నబియ్యం పంపిణీ చారిత్రాత్మక నిర్ణయం

## రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రజలకు మంచి ఆహారం ఇవ్వాలనే సదుద్దేశంతోనే ఈపథకం ప్రవేశపెట్టాం

ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తాం

తూకంలో మోసం జరిగితే చర్యలు తప్పవు

రైతులకు మేలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది

మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్‌లో సన్నబియ్యం పథకం ప్రారంభం

పోతారం(ఎస్)లో ధాన్యం కొనుగోలు

కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి

**సిద్దిపేట (హుస్నాబాద్), ఏప్రిల్ 1 సిరి న్యూస్:**

ప్రజలు ప్రభుత్వంపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని, దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ రాష్ట్రంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టడం చారిత్రాత్మక నిర్ణయమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నంప్రభాకర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని బుడగ జంగాల కాలనీలో పౌరసరఫరాల శాఖ తెలంగాణ ప్రభుత్వం ద్వారా తెల్ల రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ పథకంలో పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తెల్ల రేషన్ కార్డు మహిళలకు సన్న బియ్యం పంపిణీ చేశారు.అనంతరం మంత్రి మాట్లాడుతూ... ఉగాది రోజున సీఎం రేవంత్ రెడ్డి హుజూర్ నగర్ లో సన్న బియ్యం కార్యక్రమ పథకాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 17,263 చౌక ధర దుకాణాల ద్వారా 2,91,000 వేల రేషన్ కార్డు దారులకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం ఏప్రిల్ 1 నుంచి తెలంగాణ వ్యాప్తంగా జరుగుతుందన్నారు. ప్రజలకు మంచి ఆహారం ఇవ్వాలనే సదుద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం భావిస్తుందని అందులో భాగంగానే సన్న బియ్యం కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాలని ఉన్నప్పటికీ గత ప్రభుత్వం చేసిన రూ.7 లక్షల కోట్లకు మిత్తికి మిత్తి కట్టడానికే సరిపోతుందని, అయినప్పటికీ ప్రభుత్వం ప్రజా ఉపయోగ కార్యక్రమాలు చేపడుతుందని అన్నారు. 5సంవత్సరాల్లో అనేక సంక్షేమ కార్యక్రమాలు కాలానుగుణంగా చేపడుతూ అమలు చేసుకుంటూ పోతామని మంత్రి తెలిపారు.

**తూకంలో మోసం జరిగితే చర్యలు తప్పవు**

హుస్నాబాద్ మండలంలోని పోతారం (ఎస్) లో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సెర్ఫ్ ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. అనంతరం వరి ధాన్యం తేమ శాతంను పరిశీలించి హమాలీలతో, మహిళలతో ముచ్చటించారు. వడ్లను కొనుగోలు కేంద్రం వద్దకే తీసుకురావాలని, మద్దతు ధర పొందాలని అంతే గాని పచ్చి వడ్ల పేరుతో పొలాల వద్దనే రైతులు అమ్ముకునే ప్రయత్నం చేయొద్దని విజ్ఞప్తి చేశారు. తూకంలో మోసం లేకుండా డబ్బులు చెల్లించే విషయంలో కూడా ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గతంలో ఒక ఆసామి ఒక గ్రామంలో ధాన్యం కొనుగోలు చేసుకుని పోయి డబ్బులు ఇవ్వలేదని కొంతమంది రైతులు తన దృష్టికి తీసుకువచ్చారని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా, మోసపోకుండా ఉండడానికి రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్దనే అమ్ముకోవాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా 8 వేల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించుకుంటున్నామని, రాష్ట్రవ్యాప్తంగా పండించిన వరి ధాన్యం కొనుగోలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.రైతులకు మేలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని వ్యవసాయ పనిముట్లు, సన్న వడ్లకు బోనస్ లాంటివి ఇస్తూ వారిని బలోపేతం చేస్తామన్నారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి ఇబ్బందులు ఉన్నప్పటికీ రైతులకు ఉద్యోగులకు మహిళలకు సంక్షేమ పథకాలకు ఎక్కడ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. తూకం విషయంలో ఎక్కడ ఇబ్బందులు తలెత్తిన, అదనపు తూకం వేసిన చర్యలు తప్పమన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు ద్వారా కాలువలు త్వరగా పూర్తి చేసి పంటలకు నీళ్లు అందిస్తామని, త్వరలోనే నీళ్లు తీసుకువచ్చే బాధ్యత నాది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మను చౌదరి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, పీఏసీ చైర్మన్ శివయ్య, వ్యవసాయ అధికారులు, పాల్గొన్నారు.

## జిల్లాలో చౌక ధరల దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ: కలెక్టర్ క్రాంతి వల్లూరు

**సంగారెడ్డి, ఏప్రిల్ 01 ( సిరి న్యూస్ )**

జిల్లాలోని అన్ని మండలాలలో చౌక ధరల దుకాణాల ద్వారా లబ్ధిదారులకు ఒక్కొక్కరికి ఆరు కిలోల బియ్యం చొప్పున సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం ప్రారంభమైనట్లు జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని రేషన్ దుకాణాలకు సన్నబియ్యం పౌరసరఫరాల శాఖ గోదాముల నుండి సరఫరా జరిగినట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం జిల్లాలో అన్ని మండలాలలో ఆయా మండలాల చెందిన ప్రజాప్రతినిధులు అధికారులు మంగళవారం ప్రారంభించినట్లు తెలిపారు. జిల్లాలో 846 రేషన్ దుకాణాల ద్వారా 378728 రేషన్ కార్డులకు. 79987.81 క్వింటాల రేషన్ బియ్యం పంపిణీకి చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. రేషన్ కార్డులో పేర్లు నమోదు అయిన ప్రతి ఒక్కరికి ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. నాణ్యమైన సన్న బియ్యం ఈ పథకాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## శ్రీరామ నవమి ఉత్సవాలకు రావాలి

-మాజీ మంత్రి హరీష్ రావుకు ఆలయ నిర్వాహకుల ఆహ్వానం

**సిద్దిపేట, ఏప్రిల్ 1 సిరి న్యూస్**



సిద్దిపేట పట్టణంలో జరిగే శ్రీరామనవమి వేడుకలు రావాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు కు ఆలయ నిర్వాహకులు ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా నంగునూర్ మండలం నర్మేట గ్రామంలోని రామాలయం, సిద్దిపేట పట్టణం లోని హరిప్రియ నగర్ లోని శ్రీ అభయ ఆంజనేయ స్వామి దేవాలయం, శ్రీ పంచముఖ హనుమాన్ దేవాలయం, గణేష్ నగర్ శ్రీ ప్రసనంజనేయ స్వామి దేవాలయం, శ్రీ రామ రాజు రావి చెట్టు హనుమాన్ దేవాలయంలో జరిగే ఉత్సవాలకు రావాలని ఆయా ఆలయాల నిర్వహకులు హరీష్ రావు కు పత్రిక అందజేసి ఆహ్వానం పలికారు.

## కేతకిలో కర్నాటక నేతల పూజలు

**ఝురాసంగం ఏప్రిల్ 1 సిరి న్యూస్:**



దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీ కేతకి సంగమేశ్వర స్వామి ఆలయాన్నిమంగళవారంకర్ణాటక రాష్ట్రం ఎమ్మెల్సీలుచంద్రశేఖర్ పాటిల్, భీం రావు పాటిల్,మాజీ మంత్రి రాజశేఖర్ పాటిల్ కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు.ఆలయ ఆవరణలోని అమృత గుండాల్లో స్నానాలు ఆచరించి గర్భగుడిలోని పార్వతి సమేత సంగమేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కొరకు మాజీ మంత్రి చంద్రశేఖర్ పాటిల్ రూ.51 వేల నగదును ఆలయ కార్యనిర్వహణ అధికారి శివ రుద్రప్ప కు అందజేశారు. అనంతరం కార్యనిర్వహణ అధికారి వారిని శాలువాతో సన్మానించి ప్రసాదాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో మండలకాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హనుమంతరావు పాటిల్,శేఖర్ పటేల్, కే.మల్లయ్య స్వామి ఆలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## సంజీవయ్య పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

**అందోల్, ఏప్రిల్ 01 ( సిరి న్యూస్ )**



జోగిపేట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె సంజీవయ్య, ఆయన సోదరుని కుమారుడు క్రాంతి పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ జాతీయ ఎస్సీ కమిషన్ డైరెక్టర్ సునీల్ కుమార్ కు హైదరాబాదులో మంగళవారం వినతి పత్రం సమర్పించారు. సంజీవయ్య పై దాడి చేసిన సినీ నిర్మాత వెంకట మురళీకృష్ణ పై పిడియాక్ట్ నమోదు చేసి అరెస్టు చేయాలని కోరారు. కార్యక్రమంలో బాధితుడు పల్లె సంజీవయ్య అంబేద్కర్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు జగన్, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్, నాయకులు ఇబ్రహీం రవీందర్ పాల్గొన్నారు.